సాక్షి
పల్నాడు
మంగళవారం ၊ 20 ၊ మే ၊ 2025



కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది.



మహాలక్ష్మికి లక్ష మల్లెల పూజ

తెనాలి: అంగలకురుదులో వేంచేసిఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమ్మవారికి లక్ష మల్లెపూలతో, పలు ద్రవ్యాలతో విశేష పూజలు చేశారు.

16 రోజుల పండుగ వేడుకలు



గోలి(రెంటచింతల): గోలి గ్రామంలో అతిపురాతనమైన నాగేంద్రస్వామి వారి దేవస్థానంలోని నీలంపాటి అమ్మవారి ఆలయం 16 రోజుల పండుగ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



నరసరావుపేట: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. సోమవారం కార్యాలయంలో నష ముక్త్ భారత్ అభియాన్ 2.0లో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియచేసే పోస్టర్లను ఆవిష్కరించారు. డీఆర్‌ఓ ఏకా మురళి, డీఈఓ చంద్రకళ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్..

అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు, స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్‌లతో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరే హాజరయ్యారు.

దుగ్గిరాల మండల ఉపాధ్యక్షుడి ఎన్నిక ఏకగ్రీవం



దుగ్గిరాల: స్థానిక మండల పరిషత్ ఉపాధ్యక్ష ఎన్నిక సోమవారం నిర్వహించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి డ్వామా పీడీ శంకర్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. టీడీపీ నుంచి ఎనిమిది మంది, జనసేన నుంచి ఒకరు హాజరయ్యారు. కోరం సరిపోవడంతో ప్రిసైడింగ్ అధికారి ఎన్నిక ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ సభ్యులంతా గైర్హాజర్ అయ్యారు. తుమ్మపూడి గ్రామ ఎంపీటీసీ సభ్యురాలు వాసిరెడ్డి లక్ష్మీదేవి మంచికలపూడి ఎంపీటీసీ సభ్యుడు మరీదు రాము పేరును ప్రతిపాదించారు. ఈమని-1 ఎంపీటీసీ సభ్యురాలు పసుపులేటి సాయి చైతన్య బలపరిచారు. దీంతో మరీదు రాము ఎన్నిక ఏకగ్రీవమైంది. ప్రిసైడింగ్ అధికారి ఆయనకు ధ్రువీకరణ పత్రం అందించి ప్రమాణం చేయించారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు.

ఆర్టీసీ స్థలాల లీజుపై 22న సమావేశం

పట్నంబజారు: గుంటూరు జిల్లా పరిధిలోని పెదకాకాని, తెనాలి, పెదనందిపాడు బస్సు స్టేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు ఈనెల 22న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. ఆసక్తి గల వారు ఆ రోజు సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్టీసీ.ఏపీ.జీవోవి.ఇన్‌లో లేదా 9959225412 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గరుడ వాహనంపై గ్రామోత్సవం



తెనాలి టౌన్: వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం ఉదయం 7.30 గంటలకు నిత్య హోమం, బలిహరణ, ఉదయం 8గంటలకు గరుడ వాహనంపై పురవీధుల్లో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దివ్య రథోత్సవం, ప్రత్యేక పుష్పాలంకరణ, మేళతాళాలు, విద్యుత్ దీప కాంతుల నడుమ స్వామి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణ ప్రజలంతా తిలకించి తరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.70 అడుగుల వద్ద ఉంది. ఇది 136.3003 టీఎంసీలకు సమానం.

దౌర్జన్యమే గెలిచింది

ప్రజాస్వామ్యానికి టీడీపీ పాతర | **బలం లేకున్నా నరసరావుపేట, కారంపూడి వైస్ ఎంపీపీ స్థానాల్లో పోటీ**

ప్రజాస్వామ్యానికి అధికార కూటమి నిలువునా పాతరేసింది.. బలం లేని చోట ఎలాగైనా గెలవాలనే కుతంత్రంతో బెదిరింపుల తంత్రం.. ప్రలోభాల మంత్రం ఎంచుకుని బరిలోకి దిగింది. ఇందుకు తనిఖీల పేరుతో అధికారులు.. కేసుల బెదిరింపులతో ఖాకీలు పూర్తిగా సహకరించగా.. ఇక మిగతా పని టీడీపీ గుండాలు చూసుకున్నారు. ఎన్నికైన సభ్యులను కేంద్రాల్లోకి రానీకుండా దాడులకు దిగి, దౌర్జన్యం చేస్తూ భయానక వాతావరణం సృష్టించగా.. కవరేజీకి వెళ్లిన పాత్రికేయులపై సైతం విచక్షణ మరిచి దాడులకు పాల్పడ్డారు.

- మండల పరిషత్ ఎన్నికల్లో నిబంధనలకు తూట్లు
- అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా పదవులు
- వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను బెదిరించి ఓటు వేయించుకున్న వైనం
- మాట వినని వారిని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోకి రాకుండా అడ్డుకున్న టీడీపీ గుండాలు
- దౌర్జన్యాలకు సహకరించిన పోలీసులు



నరసరావుపేట వైస్ ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న వంపుగుడి సువార్తమ్మ



డిక్లరేషన్ ఫామ్‌తో కారంపూడి వైస్ ఎంపీపీ గాడిపర్తి రమాదేవి

నరసరావుపేట రూరల్: అధికార మదంతో కూటమి నేతలు ప్రజాస్వామ్యానికి పాతర వేశారు. మండల పరిషత్ ఎన్నికల్లో కనీసం నామినేషన్ వేయడానికి ఆ పార్టీ తరపున ఒక్క ఎంపీటీసీ కూడా లేకపోయినా తెలుగుదేశం పార్టీ బరిలో నిలిచింది. అక్రమ కేసులు, దాడుల భయం చూపి లాక్కున ఒకరిద్దరు ఎంపీటీసీలను ముందు పెట్టి వైస్ ఎంపీపీ స్థానాలను టీడీపీ దక్కించుకుంది. అక్రమంగా పదవులను దక్కించుకొనే క్రమంలో కూటమి నేతలు నిబంధనలకు పాతర వేశారు. ఎంపీటీసీలను సైతం ఎన్నిక జరుగుతున్న ఎంపీడీఓ కార్యాలయాలకు రాకుండా గుండాలతో అడ్డుకున్నారు. మాట వినని ఎంపీటీసీలను కారంపూడి ఎంపీడీఓ కార్యాలయం గేటు బయటే కొట్టి మరీ తరిమేశారు. టీడీపీ దౌర్జన్యాలను అడ్డుకోవాల్సిన పోలీసులు వారికి సహకరించడం గమనార్హం. కారంపూడి ఎంపీడీఓ కార్యాలయం వద్ద టీడీపీ గుండాల దురాగతాలను కవర్ చేయడానికి అక్కడికి వెళ్లిన 'సాక్షి' టీవీ గుంటూరు జిల్లా ప్రతినిధి అశోక్ వర్ధన్‌పై పచ్చ గుండాలు దాడి చేశారు. అశోక్‌పై పిడుగుద్దులు గుద్దుతూ దాడి చేస్తుండగా పోలీసులు రక్షించారు. దీనిపై జర్నలిస్టు సంఘాలు, ప్రజాసంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నరసరావుపేట వైస్ ఎంపీపీగా సువార్తమ్మ

నరసరావుపేట మండల పరిషత్ ఉపాధ్యక్షురాలిగా కొత్తపాలెం ఎంపీటీసీ వంపుగుడి సువార్తమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం వైస్ ఎంపీపీ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. మండల పరిషత్‌లో మొత్తం 17 మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన వైస్ ఎంపీపీ ఎన్నిక ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు మాత్రమే హాజరయ్యారు. ప్రత్యేక సమావేశాన్ని వైఎస్సార్ సీపీ బహిష్కరించింది. వైస్ ఎంపీపీ ఎన్నిక గతంలో రెండు సార్లు కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. మూడవ సారి నిర్వహిస్తున్న ఎన్నిక కావడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి ప్రత్యేక అధికారాన్ని వినియోగించారు. కోరం లేక రెండు సమావేశాలు వాయిదా పడితే మూడవ సమావేశంలో హాజరైన వారిలో ఒకరిని వైస్ ఎంపీపీగా ఎన్నుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. కొత్తపాలెం ఎంపీటీసీ వంపుగుడి సువార్తమ్మ వైస్ ఎంపీపీగా నామినేషన్ దాఖలు చేశారు. పమిడిపాడు-1 ఎంపీటీసీ కంచేటి భార్గవి ప్రతిపాదించగా, ఉప్పలపాడు ఎంపీటీసీ కందుల దుర్గమ్మ బలపరిచారు. సువార్తమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

కారంపూడిలో దౌర్జన్యకాండ...

కారంపూడి మండలం వైస్ ఎంపీపీగా టీడీపీ బలపరిచిన గాడిపర్తి రమాదేవి సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత ఎన్నికల్లో 14 ఎంపీటీసీ స్థానాలకు 14 వైఎస్సార్ సీపీ అభ్యర్థులే గెలుపొందారు. కారంపూడి మండలం వేపకంపల్లి ఎంపీటీసీ వైస్ ఎంపీపీ-2గా కొనసాగుతూ మరణించడంతో వైస్ ఎంపీపీ ఎన్నిక అనివార్యం అయింది. గత రెండు పర్యాయాలు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు గైర్హాజరవడంతో ఎన్నిక వాయిదా పడింది. తిరిగి మరొకసారి ఎన్నిక కమిషన్ సోమవారం నోటిఫికేషన్ ఇవ్వడంతో 14 మంది ఎంపీటీసీలకు గాను ఆరుగురు హాజరు కాగా గాదెవారిపల్లి ఎంపీటీసీ కూనిరెడ్డి సైదారెడ్డి బలపరచగా ఒప్పిచర్ల చెందిన ఇద్దరు ఎంపీటీసీలు ఆమోదించగా మిగతా ఎంపీటీసీలు మద్దతుతో వైస్ ఎంపీపీగా రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎస్.లింగమూర్తి అధికారికంగా ప్రకటించారు. అంతకుముందు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను ఎన్నికలు జరుగుతున్న కారంపూడి ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్లనివ్వకుండా అడ్డుకొని దాడులు చేశారు. కారంపూడిలో భయానకవాతావరణం సృష్టించి టీడీపీ ఎన్నికల్లో గెలుపొందింది.

ఉప సర్పంచ్‌గా ఏఎస్‌కేవీ రంగారెడ్డి ఏకగ్రీవం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): చాగంటివారిపాలెం గ్రామ ఉపసర్పంచ్‌గా వైఎస్సార్ సీపీకి చెందిన అన్నపురెడ్డి శివకోటి వెంకటరంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం గ్రామ సచివాలయంలో జరిగిన ఉప ఎన్నికల్లో 3వ వార్డు సభ్యుడైన రంగారెడ్డిని 11వ వార్డు సభ్యురాలు నీలం కోటేశ్వరమ్మ ప్రతిపాదించగా, 1వ వార్డు సభ్యురాలు పుష్పలత బలపరిచారు. ఆ మేర ఉపసర్పంచ్‌గా రంగారెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, ఈఓపీఆర్డీ ఎస్.రూపవతి ప్రకటించారు. ధ్రువీకరణ పత్రాన్ని అందించి ప్రమాణస్వీకారం చేయించారు.

బొప్పూడి ఉపసర్పంచ్‌గా అమీర్‌జాని

చిలకలూరిపేట: మండలంలోని బొప్పూడి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీకి చెందిన అప్పాపురం షేక్ అమీర్‌జాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుమారు ఆరునెలల కిందట ఉప సర్పంచ్‌గా ఉన్న నందిగం మేరి తన పదవికి రాజీనామా చేయడంతో ఉపసర్పంచ్ పదవికి ఎన్నిక నిర్వహించారు. వైఎస్సార్ సీపీకి సర్పంచ్‌తో పాటు 12 మంది వార్డు మెంబర్లలో 9 మంది బలముంది. టీడీపీకి కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే ఉన్నారు. ఈ నేపథ్యంలో అమీర్ జాని ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయనను ఎన్నిక చేసినట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.సూర్యతేజ ప్రకటించారు. అమీర్‌జానిని సర్పంచ్, వార్డు సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

మండ్రువారిపాలెం ఉప సర్పంచ్‌గా 'పాపసాని'

శావల్యాపురం: మండలంలోని ముండ్రువారిపాలెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం జరిగినట్లు ఎన్నికల అధికారి ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో 10 మంది వార్డు సభ్యులకుగానూ 9 మంది ఎన్నికల్లో పాల్గొన్నారు. 4వ వార్డు సభ్యుడు పాపసాని వెంకటేశ్వర్లును ఉప సర్పంచ్‌గా ఏకగ్రీవంగా సభ్యులు చేతులెత్తే విధానంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఏఆర్ డీఎస్పీ గాంధీ, ఎస్‌ఐ లేళ్ల లోకేశ్వరరావు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ పేరు మీనా సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి వాసు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 150 అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇస్తూ ఆయా శాఖల అధికారులు సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. డీఆర్‌ఓ ఏకా మురళి, ఆర్డీఓ మధులత పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించండి



ప్రతి రోజూ 24గంటలూ సేవలు అందజేసే కేబుల్ ఆపరేటర్లకు గత ఏడు నెలలుగా ఏపీ ఫైబర్ నెట్ సంస్థ ద్వారా ప్రతిరోజూ సిగ్నల్ అంతరాయం కలుగుతుంది. దీనికి అనుభవజ్ఞులైన సాంకేతిక సిబ్బందితో పరిష్కారం చూపించాలి. సెటాప్ బాక్స్‌ల రెంటల్ చార్జీల గడువు ముగిసినా తమ నుంచి రూ.59 వసూలు చేయటం విడనాడాలి. పెట్టుబడి రూపంలో ఆర్థిక సహాయం చేసి సెటాప్‌బాక్స్‌లు, ఓఎల్‌టీలు, బ్యాటరీలు అందుబాటులో ఉంచాలి. కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి.

–బీవీవీ భాస్కరరెడ్డి, వెంకటరావు, అధ్యక్ష, కార్యదర్శులు, కేబుల్ ఆపరేటర్లు ఏపీ మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్స్ సంక్షేమ సంఘం

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు లక్ష షరతులు విధిస్తున్నారు



ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసేందుకు బ్యాంకర్లు సిబిల్ స్కోర్ బాగుండాలని, ష్యూరిటీ చూపించాలని, గతంలో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల బాకీలు ఉండకూడదని, డ్వాక్రాలోను సైతం పెండింగ్ ఉండరాదనే షరతులతో లబ్ధిదారులను వేధిస్తున్నారు. దీనివలన రుణాలు అందక ఎస్సీ వర్గీయులు ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకర్లతో వెంటనే సమావేశం ఏర్పాటుచేసి లబ్ధిదారులకు సులభంగా రుణాలు మంజూరుచేసేలా ఆదేశాలు ఇవ్వండి.

– చింతిరాల మీరయ్యమాదిగ, మాదిగ రిజర్వేషన్ పోరాట సాధన సమితి

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టండి



జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు యాజమాన్యాలు అధిక ఫీజులతో పాటు పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్ పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

–నల్లపాటి రామారావు, జి.రామకృష్ణ, వి.కోటానాయక్, ప్రజాసంఘాల నాయకులు

ఈఏపీ సెట్ ప్రారంభం



గుంటూరు ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీ ఈఏపీసెట్-2025 ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్టులు (సీబీటీ) సోమవారం ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 3,347 మంది విద్యార్థులు హాజరయ్యారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 22 కేంద్రాల పరిధిలో సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో జరిగిన ఆన్‌లైన్ పరీక్షలకు దరఖాస్తు చేసిన 3,588 మంది విద్యార్థుల్లో 3,347 మంది హాజరయ్యారు. మంగళవారం ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరగనుండగా, ఈనెల 21 నుంచి ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సోమవారం ఆయా కేంద్రాల పరిధిలో ఆన్‌లైన్ సీబీటీ పరీక్షలు సజావుగా జరిగాయి.

అదే.. ఆ తల్లి ప్రత్యేకత

ప్రత్యేక అవసరాలు గల బిడ్డలు ఎందరికో తల్లిగా మారింది

- మానసిక పరిణితి లేని ఆడపిల్ల నీహారిక
- కంటిపాపలా చూసుకున్న తల్లిదండ్రులు
- ఆనందాన్నీ, అవసరాలను వదులుకున్నారు
- బిడ్డ కోసం టీచరుగా మారిందా తల్లి
- ఇష్టమైన సైక్లింగ్‌లోనూ శిక్షణనిచ్చింది
- స్పెషల్ ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గేలా చూశారు
- ఇప్పుడా బిడ్డలాంటి మరికొందరికోసం ఏకంగా అలాంటి పాఠశాలనే నడుపుతోందా తల్లి



కుమార్తె నీహారికతో ముక్కామల భార్గవి

తెనాలి: ''అది 2019 సంవత్సరం మార్చి నెల. 14-21 తేదీల్లో దుబాయ్‌లో స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్. 25 గేమ్స్‌లో 170 పైగా దేశాలకు చెందిన ఏడు వేల క్రీడాకారులు పాల్గొన్నారు. మనదేశం నుంచి 280 మంది వివిధ పోటీల్లో తలపడ్డారు. ఇందులో సైక్లింగ్‌లో 16 మంది పాల్గొంటే, ఆంధ్రప్రదేశ్ నుంచి ఓ యువతి ఆ పోటీలో పాల్గొంది. ఆ పోటీల్లో యువతి 500 మీటర్లు, కిలోమీటరు పోటీలు రెండింటిలోనూ ద్వితీయ స్థానం సాధించి రజత పతకాలను కైవసం చేసుకుంది. రెండు కి.మీ పోటీల్లో ఆరోస్థానంలో నిలిచింది. ఆ యువతే 2018లో రాంచీలో నిర్వహించిన జాతీయ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో కిలోమీటరు సైక్లింగ్‌లో బంగారు పతకం, రెండు కి.మీ విభాగంలో రజత పతకం గెలిచి, స్పెషల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది.'' మానసిక పరిపక్వత లేదని సమాజం ఈసడించింది. తనపై డబ్బు ఖర్చుచేసినా, శ్రమ వెచ్చించినా ఎలాంటి ప్రయోజనం లేదు... తిండి, బట్ట ఇస్తే సరిపోతుందని తల్లిదండ్రులకు జాగ్రత్తలు చెప్పింది. అయితే సమాజం మాటవిని ఆ పాపను తల్లిదండ్రులు వదిలేయలేదు. తనకోసం తమ ఆనందాల్నీ, అవసరాలనూ వదులుకున్నారు. మానసిక వికలాంగురాలైన తమ కూతురు నీహారికను తన కాళ్లపై తాను నిలబడేలా చేయాలని కంకణం కట్టుకున్నారు. విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాలలో చదివిస్తూ తనకెంతో ఇష్టమైన సైక్లింగ్‌లో శిక్షణనిస్తూ వచ్చిందా తల్లి భార్గవి. తద్ఫలితమే.. నీహారిక సాధించిన విజయాలు.

భార్గవి సొంతూరు చినపరిమి

భార్గవి సొంతూరు తెనాలి సమీపంలోని చినపరిమి. భర్త ఆర్మీ ఉద్యోగి ముక్కామల శివరామకృష్ణ. 2001లో తొలి కాన్పులో లక్ష్మీదేవి పుట్టిందని సంబరపడ్డారు. ఏడాదిన్నర వచ్చినా నడక రాకపోవటంతో అనుమానం వేసింది. ఉద్యోగరీత్యా అప్పుడు జమ్మూ కశ్మీర్‌లో ఉన్నారు. 'ఒకసారి న్యూమోనియాకు ఇచ్చిన మందు ఓవర్‌డోస్ అయి, నాలుగురోజులు పాప కోమాలో ఉంది... తెలివొచ్చేసరికి మాటలు బాగా తగ్గిపోయాయి..చెప్పిందీ అర్థం చేసుకోవటం తగ్గింది. డ్రమ్స్ మోగినా, బాణసంచా పేలుళ్లు విన్నా, భయంతో వణికేది...పెరిగేకొద్దీ ఆ భయం ఎక్కువైంది' అని భార్గవి గుర్తుచేసుకున్నారు. అయిదో ఏడు వచ్చేసరికి ఆగ్రాకు వెళ్లారు. అక్కడి డాక్టర్లు 'ఇంటలెక్చువల్ డిసేబిలిటీ' అన్నారు. 'పిల్లలతో విపరీతంగా ప్రవర్తించేది అప్పుడే...డ్రమ్స్, బాణసంచా మోతకు భయపడిపోయేది. ఎవరినీ దగ్గరకు రానిచ్చేదికాదు...తనొక్కతే ఏదొక వస్తువుతో ఆడుకుంటూ ఉండేది...ఆ క్రమంలో సైకిల్ తనను బాగా ఆకర్షించింది...చిన్న సైకిల్ నడిపేది. పాడైపోతే కొత్తది కొనేదాకా ఊరుకునేది కాదు...ఆ ఆసక్తిని గమనించి ప్రోత్సహించాను' అన్నారు భార్గవి. అప్పటికి తనకు మరో బాబు కలిగాడు.

కుమార్తె కోసం త్యాగాలు..

పాప ఆరోగ్యం కారణంగా హైదరాబాద్‌కు బదిలీ చేయించుకున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాలలో చేర్పించారు. కొడుక్కి హోం వర్క్ చేయించేటపుడు, నీహారికను దగ్గరుంచారు. స్పీచ్ థెరపీనీ ఇప్పించారు. 2013లో విజయవాడకు వచ్చేశారు. 2013 నవంబరులో ఇలాంటి పిల్లల కోసం ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని తెలుసుకున్నారు. 2014లో పార్టిసిపేట్ చేసేలా చూశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకు పాపను నిద్రలేపటం, హైవేపై 10 కి.మీ ప్రాక్టీస్ చేయించి, ఇంటికి తీసుకొచ్చేవారు. తర్వాత 'ఆటిజమ్ రీసెర్చ్ అండ్ మల్టీ డిసిప్లిన్ స్కూలు'కు తీసుకెళ్లారు. నీహారిక కోసం తనుకూడా అదే స్కూలులో ఉద్యోగం చేశారు భార్గవి. శివరామకృష్ణ కూడా వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు తల్లిలా..

తన బిడ్డ నీహారిక లాంటి మరికొందరి కోసం ఇప్పుడా తల్లి ఏకంగా స్కూలునే నడుపుతోంది. 2020లో ప్రజ్ఞ వెల్ఫేర్ సొసైటీని రిజిస్టరు చేశారు. 2022 నుంచి ఆ సొసైటీ తరఫున సాయి అంకుర్ స్పెషల్ స్కూల్‌ను ఆరంభించారు. 2019లో స్పెషల్ ఒలింపిక్స్‌లో పతకాల సాధనతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రైజ్‌మనీతో మొదలుపెట్టిన స్కూలుకు ఇప్పుడు సొంత డబ్బులు పడుతున్నాయి. పిల్లల తల్లిదండ్రుల మద్దతు తోడవుతోంది. పిల్లలు తమ పనులు తాము చేసుకోవటం, అవసరాలను తీర్చుకోవటం, వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడేలా శిక్షణనివ్వటం తమ ఆశయమని చెప్పారు భార్గవి. తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులోని 'సాయి అంకుర్ స్పెషల్ స్కూల్' ఇప్పుడు భార్గవి ప్రపంచం. 24 ఏళ్ల కుమార్తె నీహారికతో సహా పదిహేనుమంది విభిన్న ప్రతిభావంతులు అక్కడ ఉన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అక్కడ పిల్లలకు రకరకాల యాక్టివిటీస్, ఆటలతో బోధన ఉంటుంది. రోజువారీ స్కూలుకు వెళుతూ రెమిడియల్ క్లాసుకు వచ్చేవారూ ఉన్నారని భార్గవి చెప్పారు. తనతోపాటు అక్కడ ముగ్గురు టీచర్లు, ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ పని చేస్తున్నారు. పాప కోసం 'ఆటిజమ్ రీసెర్చ్ అండ్ మల్టీ డిసిప్లిన్ స్కూలు' టీచరుగా పనిచేసిన భార్గవి, ఇప్పుడు ఏకంగా అలాంటి స్కూలునే నడుపుతూ ఎందరికో తల్లిలా మారింది.



స్కూల్ వార్షికోత్సవంలో..

మరెన్నో విజయాలు..

2014లో భోపాల్‌లో జరిగిన ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లోనూ కి.మీ, 2 కి.మీ విభాగాల సైక్లింగ్‌లో బంగారుపతకం, రజత పతకాన్ని నీహారిక సాధించింది. ఈ విజయంతో 2015లో లాస్‌ఏంజెల్స్‌లో జరిగిన స్పెషల్ ఒలింపిక్స్‌కు ఎంపికైనా, అనివార్య కారణాలతో సైక్లింగ్‌లో పాల్గొనేందుకు వీల్లేకపోయింది. యూనిఫైడ్ వాలీబాల్ గేమ్‌లో భారత జట్టుకు ఆడి, కాంస్య పతక సాధనకు తోడ్పడింది. రెండు స్పెషల్ ఒలింపిక్స్‌లో ఆడి పతకాలను సాధించటం నిస్సందేహంగా నీహారిక ఘనతే. ఇందుకు పునాది, పట్టుదల, తపన ఆమె తల్లి భార్గవిది. పట్టుదలతో కృషిచేస్తే సాధించలేనిది ఏదీ లేదనేందుకు నిదర్శనమే వీరి విజయం.



స్పెషల్ ఒలింపిక్స్‌లో తలపడుతున్న నీహారిక (ఫైల్)

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 4,000

మోడల్ ధర రూ. 3,200



పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1048

కొమ్ములు : 783 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	11,171	10,650

కాయలు : 265 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	11,171	10,650

మొత్తం అమ్మకాలు : 786.000 క్వింటాళ్లు

–దుగ్గిరాల

చీకటి పువ్వు నాటికకు బహుమతుల పంట



ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న చీకటి పువ్వు నాటిక బృందం



చీకటి పువ్వు నాటికలోని ఓ సన్నివేశం

ముగిసిన చిలకలూరిపేట కళాపరిషత్, సీఆర్ క్లబ్ నాటికల పోటీలు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: చిలకలూరిపేటలో కళాకారుల ప్రతిభావేదికగా నిలిచిన తొమ్మిదో ఆహ్వాన నాటికల పోటీలు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. చిలకలూరిపేట కళా పరిషత్, సీఆర్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఈ మూడు రోజుల కళా ఉత్సవం 9 నాటికల ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించింది. భావోద్వేగాలకు మించిన రంగస్థల పోరాటాలు, సమకాలీన సమాజ సమస్యలపై ఆలోచనాత్మక సందేశాలు అందించిన ఈ నాటికలు కళాభిమానులను రంజింపజేశాయి. పట్టణ ప్రజలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి సైతం కళాభిమానులు భారీగా తరలివచ్చి పండుగ వాతావరణాన్ని తలపింపజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా కేవీ మంగారావు, జెట్టి హరిబాబు, సుమ పమిడిగంటి వ్యవహరించారు. బహుమతులు అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేయగా, కార్యక్రమానికి ఏవీ శివయ్య అధ్యక్షత వహించగా పరిషత్ అధ్యక్షుడు చెరుకూరి కాంతయ్య, సీఆర్ క్లబ్ కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు, కోశాధికారి మక్కెన నరసింహారావు, వేదిక అధ్యక్షులు డా. ముత్తవరపు సురేష్ బాబు, రోటరీ క్లబ్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, బ్రహ్మానందం, కొత్త శివ, షేక్ షఫీ, ఆళ్ల హరిబాబు, మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకులు షేక్ జమాల్‌బాషా, అంబటి బాలస్వామి, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'చీకటి పువ్వు'

ఈ ప్రతిష్టాత్మక పోటీలో చైతన్య కళాభారతి(కరీంనగర్) వారి 'చీకటి పువ్వు'నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికై బహుమతిని సొంతం చేసుకుంది. అమృత లహరి థియేటర్ ఆర్ట్స్(గుంటూరు) వారి 'నాన్న నేను వచ్చేస్తా' నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా నిలవగా, అమరావతి ఆర్ట్స్'(గుంటూరు) వారి 'చిగురు మేఘం' నాటిక తృతీయ ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. కళాంజలి(హైదరాబాద్) వారి 'రైతే రాజు' నాటికకు జ్యూరీ ప్రదర్శనగా బహుమతి లభించింది.

వ్యక్తిగత విభాగాల్లో..

చీకటి పువ్వు నాటికకు సంబంధించి ఉత్తమ నటిగా లహరి, ఉత్తమ నటుడు కె.సత్యనారాయణ, ఉత్తమ దర్శకుడు మంచాల రమేష్, ఉత్తమ సంగీతం సురభి నాగరాజు, ప్రత్యేక బహుమతి ఏపూరి శ్రీనివాస్‌లు అందుకున్నారు. నాన్న నేను వచ్చేస్తా : ఉత్తమ క్యారెక్టర్ నటిగా అమృత వర్షిణి, ప్రత్యేక బహుమతి ఎస్.కే.హసన్ అందుకున్నారు. చిగురు మేఘం: ఉత్తమ విలన్ కె.సరిత, ఉత్తమ సహాయనటి బి.నాగరాణి, ప్రత్యేక బహుమతి ప్రసాద్. రైతే రాజు: ఉత్తమ రచన కంచర్ల సూర్యప్రకాశ్, ప్రత్యేక బహుమతి తిరుమల. దొందు దొందే: ఉత్తమ హాస్యనటుడు జబర్దస్త్ ప్రకాష్, ఉత్తమ ఆహార్యం కె.కుమారి, ప్రత్యేక బహుమతి కె.కుమారి. బ్రహ్మ స్వరూపం: ఉత్తమ రంగాలంకరణ పీవీ కుమార్, ప్రత్యేక బహుమతి వి.సి.హెచ్.కె. ప్రసాద్. ఇది రహదారికాదు నాటికకు ప్రత్యేక బహుమతిని చిరంజీవి దేవేష్ అందుకున్నారు.

అర్జీలను సత్వరం పరిష్కరించండి

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు
- పీజీఆర్ఎస్‌కు 72 ఫిర్యాదులు

నరసరావుపేట: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్ఎస్‌కు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి 72 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, మోసం తదితర సమస్యలకు చెందిన ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని పోలీసు సిబ్బందిని ఆయన ఆదేశించారు. వచ్చిన వాటిలో కొన్నింటిని పరిశీలిస్తే...



బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ఉద్యోగం ఇప్పిస్తామని రూ.8లక్షలు మోసం



నేను సత్తెనపల్లిటౌన్‌లో పాత బండ్లు కొనుగోలు, అమ్మకాలు వ్యాపారం చేస్తుంటాను. నా పెద్ద కుమారుడు సైదా బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తిచేసి ఇంటి వద్ద ఖాళీగా ఉన్నాడు. ఆ సమయంలో మా షాపునకు ఎదురుగా చికెన్‌షాప్ నిర్వహిస్తున్న జ్యోతి ద్వారా కర్నూలుకు చెందిన తిరుమలేసురెడ్డితో పరిచయం ఏర్పడింది. అతను తనకు ఎప్పటినుంచో పరిచయం ఉన్నాడని, తనకు తెలిసిన అనేక మందికి ఉద్యోగాలు ఇప్పించాడని, నీ కుమారుడికి డిలైట్ కన్సల్టింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, హైటెక్ సిటీ, హైదరాబాద్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. నాకు ప్రధానమంత్రి రుణం ఇప్పిస్తానంటూ నా వద్ద నుంచి రూ.8లక్షలు తీసుకున్నారు. నా కుమారుడికి ఉద్యోగం పేరుతో ఆఫర్ లెటర్, జాయినింగ్ లెటర్ సెల్‌ఫోన్‌కు పంపించారు. దానిని తీసుకొని నా కుమారుడు సైదా కంపెనీ వద్దకు వెళ్లగా అవి ఫేక్ అని, ఆ కాగితాలతో తమకు ఎటువంటి సంబంధం లేదని కంపెనీవారు చెప్పారు. దీంతో తమను వారిద్దరూ మోసం చేశారని గ్రహించి, డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగ్గా నాపై దాడిచేశారు. వారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–షేక్ యలవర్తిపాటి బాజీ, ములకలూరు, నరసరావుపేట మండలం

వరకట్నం కోసం వేధిస్తున్నారు

నాకు అచ్చంపేట గ్రామానికి చెందిన వేపూరి వెంకటేశ్వర్లుతో రెండేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి నా భర్త, అత్త వరకట్నం తీసుకురావలసిందిగా పలుమార్లు వేధిస్తున్నారు. నా భర్త చీటికీమాటికి కొడుతూ ఉండటంతో నేను తల్లి ఇంటి వద్ద ఉంటున్నాను. నన్ను శారీరకంగా, మానసికంగా హింసిస్తూ కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నవారిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, పాతగణేశుని పాడు, పిడుగురాళ్ల మండలం

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా శైలజ బాధ్యతల స్వీకరణ

మంగళగిరి : చినకాకానిలోని మహిళా కమిషన్ కార్యాలయంలో సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని మహిళలకు అండగా నిలవడమే తమ లక్ష్యమని చెప్పారు. మహిళలకు ఏ కష్టం వచ్చినా కమిషన్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మహిళల హక్కులు, సంక్షేమ సాధనకు కృషి చేస్తామని ఆమె పేర్కొన్నారు.

పిన్నెల్లి ఉప సర్పంచ్‌గా సుబ్బారావు ఏకగ్రీవం

మాచవరం: మండలంలోని పిన్నెల్లి గ్రామ ఉప సర్పంచ్‌గా శిరంగి సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి సురేష్ తెలిపారు. ఉప సర్పంచ్ ఎన్నికకు సోమవారం గ్రామ పంచాయతీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 మంది వార్డు సభ్యులు హాజరు కాగా , 8వ వార్డు మెంబరు సుబ్బారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఉప సర్పంచ్‌ల ఎన్నిక..

నూజెండ్ల: మండలంలోని కొత్తజడ్డావారిపాలెం, పాతజెడ్డావారిపాలెం గ్రామపంచాయతీల ఉపసర్పంచ్ ఎన్నికలు సోమవారం నిర్వహించారు. కొత్తజడ్డావారిపాలెం పంచాయతీకి పంచాయతీరాజ్ ఏఈ అల్లాబక్షు, పాతజడ్డావారిపాలెం గ్రామపంచాయతీకి హౌసింగ్ ఏఈ యల్లమంద రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించారు. ఉపసర్పంచ్ ఎన్నికల్లో కొత్తజడ్డావారిపాలెంకు పులిగుజ్జు ప్రసాద్, పాతజడ్డావారిపాలెం ఉపసర్పంచ్‌గా బోరిగళ్ళ నాగేశ్వరరావులను వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు

చీరాల అర్బన్: తినుబండారాలు ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మితే చర్యలు తప్పవని చీరాల తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రపంచ తూనికలు, కొలతలు దినోత్సవం ఈనెల 20న నిర్వహిస్తున్నామని చెప్పారు. అలానే తూనికలు, కొలతల విభాగం 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లోని స్టాల్స్‌ను పరిశీలించారు. స్టాల్స్ నిర్వహించేవారు ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులకు అమ్మే ప్రతి వస్తువును నిర్దేశించిన ధరలకు మాత్రమే అమ్మాలన్నారు.

ప్రారంభమైన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా పరిధిలోని 25 పరీక్షా కేంద్రాలలో తొలిరోజు తెలుగు పరీక్షకు 1,038 మంది విద్యార్థులకు గాను 665 మంది హాజరయ్యారు. పరీక్షలను పారదర్శకంగా నిర్వహించేందుకు 4 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసారు. పట్టణంలోని నాలుగు పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ సందర్శించి తనిఖీలు నిర్వహించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా 19 పరీక్షా కేంద్రాలలో స్క్వాడ్ బృందాలు తనిఖీలు చేశారు. జిల్లాలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ చంద్రకళ తెలిపారు. అదేవిధంగా సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో పదవ తరగతి, ఇంటర్ దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి.

సజావుగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం జిల్లాలో సజావుగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్ష కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 841 మంది విద్యార్థుల్లో 561 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

రేపు డీఈఓ కార్యాలయం ముట్టడి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సోమవారం సుదీర్ఘంగా జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈనెల 21న డీఈవో కార్యాలయ ముట్టడి యథాతథంగా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.బసవ లింగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదించిన డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం వరకు వ్యవధిస్తున్నామని ఆయన పేర్కొన్నారు

ప్రజా రవాణాలో డ్రైవర్లది ముఖ్యపాత్ర

- పీటీడీ జిల్లా అధికారి మధు
- శిక్షణ పొందిన డ్రైవర్లకు సర్టిఫికెట్లు ప్రదానం



సర్టిఫికెట్లు పొందిన డ్రైవర్లతో జిల్లా అధికారి మధు, డీఎం శ్రీనివాసరావు

నరసరావుపేట: శిక్షణ తీసుకున్న డ్రైవర్లు ప్రమాదరహితంగా వాహనాలను నడుపుతూ ఇంధన పొదుపు డ్రైవర్లుగా మెలగాలని జిల్లా ప్రజారవాణా అధికారి ఎం.మధు ఆకాంక్షించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఉన్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకున్న 19వ బ్యాచ్ డ్రైవర్లకు సోమవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా రవాణాలో డ్రైవర్లది ముఖ్యపాత్రని, వారు శారీరకంగా, మానసికంగా దృఢంగా వుండాలని సూచించారు. చెడు అలవాట్లకు స్వస్తి పలికి సేవా దృక్పథం అలవర్చుకోవాలని, ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించి ప్రమాదాలు నివారించాలని వెల్లడించారు. డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు పి.బొల్లయ్య, షేక్ సుభాని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు నియామకం



నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేటకు చెందిన పలువురిని నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. యూత్ వింగ్ అధ్యక్షుడిగా కోటపాటి శ్రీ మణింద్ర రెడ్డి, మహిళా విభాగానికి బొబ్బిలి శ్రీలక్ష్మి, రైతు విభాగానికి కొబ్బరి పూర్ణచంద్రరావు, బీసీ సెల్‌కు మర్రిపూడి రాంబాబు, ఎస్సీ సెల్‌కు కుక్కల పోలయ్య, ఎస్టీ సెల్‌కు మొగిలి ఆంజనేయులు, మైనార్టీ సెల్‌కు షేక్ సిలార్‌బాషా, క్రిస్టియన్ మైనార్టీసెల్‌కు దార్లపాటి మేరి బ్లెస్సీనా, స్టూడెంట్ వింగ్‌కు యర్రంరెడ్డి విజయ మనోహరరెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్‌కు ముంద్రు హరినారాయణ, మున్సిపల్ వింగ్‌కు మాగులూరి రమణారెడ్డి, ఆర్‌టీఐ వింగ్‌కు జీనేపల్లి హనుమంతరావు నియమితులయ్యారు. అదేవిధంగా వలంటీర్ల వింగ్ అధ్యక్షుడిగా పోలుబోయిన మధు, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా షేక్ ఖాదర్ బాష, వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా మిట్టపల్లి శేఖర్, చేనేత వింగ్ అధ్యక్షుడిగా గుణదల శ్రీనివాసరావు, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షుడిగా షేక్ వలి, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షులుగా జొన్నలగడ్డ హెల్డా ఫ్లోరెన్స్, లీగల్‌సెల్ అధ్యక్షుడిగా వై.సీ తారామిరెడ్డి, కల్చరల్ వింగ్ అధ్యక్షులుగా కంచర్ల విజయలక్ష్మి, సోషల్ మీడియా వింగ్‌కు బూదాల కల్యాణ్, ఐటీ వింగ్‌కు వీరంరెడ్డి నాగిరెడ్డి, దివ్యాంగుల విభాగానికి గంటా శ్రీనివాసరెడ్డి, డాక్టర్ల వింగ్‌కు డాక్టర్ దొండేటి వసంతరాయ, పబ్లిసిటీ వింగ్‌కు గానుగపంట ఉత్తమ రెడ్డి, బూత్ కమిటీ వింగ్‌కు పఠాన్ హిదాయిత్ ఖాన్, ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షుడిగా పల్లెర్ల మల్లికార్జునరెడ్డి నియమితులయ్యారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాగాల్లో పలువురు జిల్లా నాయకుల నియామకం

నరసరావుపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన పలువురు నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీలో వివిధ విభాగాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ స్టేట్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా సత్తెనపల్లికి చెందిన రాజారపు శివనాగేశ్వరరావు, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శిగా పెదకూరపాడుకు చెందిన షేక్ బాజి, రాష్ట్రపంచాయతీరాజ్ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నరసరావుపేట రొంపిచర్ల మండలానికి చెందిన పడాల చక్రారెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా వింగ్ సంయుక్త కార్యదర్శిగా సత్తెనపల్లికి చెందిన పాలూరి రాజశేఖరరెడ్డి నియమితులయ్యారు.

విద్యుత్‌షాక్‌తో రైతు దుర్మరణం



మృతుడు చేకూరి హనుమంతరావు

నాదెండ్ల: విద్యుత్ షాక్‌కు గురై రైతు దుర్మరణం పాలైన సంఘటన మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు చేకూరి హనుమంతరావు (70) తూబాడు రోడ్డులో తనకున్న వ్యవసాయ భూమిలో నర్సరీ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం 3.30 సమయంలో తన పొలానికి వెళ్లి ఇనుప గేటు తీసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పొలం చుట్టూ రక్షణగా వేసిన ఇనుప కంచెకు విద్యుత్ వైరు తగిలి విద్యుత్ ప్రవహించినట్లు తెలుస్తోంది. దీంతో గేటు తీసే క్రమంలో షాక్‌కు గురైనట్లు భావిస్తున్నారు. ఈ పొలాన్ని కౌలుకు తీసుకున్న చంటి అనే వ్యక్తి సాయంత్రం 4 గంటల సమయంలో పొలానికి వెళ్లగా, విగతజీవిగా పడిఉన్న హనుమంతరావును చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

పట్నంబజారు: మహిళపై లైంగిక దాడితో పాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. పాత గుంటూరు పోలీసు స్టేషన్ సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వై.వీ రసోమయ్య వివరాలు వెల్లడించారు. ఈనెల 12న మధ్యాహ్నం సుద్దపల్లి డొంక ప్రగతీ నగర్ 7వ లైనుకు చెందిన మహిళ తల్లి ఇంటికి వెళ్లింది. చుట్టుపక్కల ఎవరూ లేని సమయంలో అదే ప్రాంతానికి చెందిన షేక్ షాబాజ్ ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి అమ్మమ్మ రాహిలమ్మ రావడంతో ఆమెను నెట్టివేసి అక్కడి నుంచి షాబాజ్ పరారయ్యాడు. మరుసటిరోజు 13వ తేదీన నిందితుడు షాబాజ్, ఆయన మేనమామ నాగూల్ మీరా, బంధువులు నాసర్ హుసేన్, హనీఫ్‌లు మహిళ ఇంటి వద్దకు వెళ్లి, జరిగిన విషయాన్ని ఎవరికైనా చెబితే చంపుతామని బెదిరించారు. దీంతోపాటు కులం పేరుతో దూషించి వారి పట్ల అనుచితంగా ప్రవర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడు షేక్‌షాబాజ్‌ను సోమవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఎస్ఐ షేక్ అబ్దుల్ రహమాన్, సిబ్బందిని అభినందించారు. నిందితుడు షాబాజ్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

పేదల ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

గుంటూరు వెస్ట్: పేదల ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్ నుంచి సోమవారం అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం ఒక ప్రభుత్వ శాఖతో వీలుపడదని, అన్ని శాఖల మండల, జిల్లా అధికారులు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని ఆయన సూచించారు. నిర్మాణానికి అవసరమైన సిమెంటు, ఇనుము అందుబాటులో ఉందని, ఇసుక కూడా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హౌసింగ్ లేఅవుట్లలో అప్రోచ్ రోడ్ల నిర్మాణం కోసం టెండర్లు పిలవాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలని చెప్పారు.

ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు

నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్ బాబు



ఇన్సూ్యరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన న్యాయమూర్తులు

గుంటూరు లీగల్: ఈనెల 19 నుంచి జులై 5 వరకు జరగనున్న లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ప్రమాదాల కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడానికి కృషి చేయాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు చెప్పారు. ఇన్సూ్యరెన్స్ కంపెనీస్ ప్రతినిధులు, న్యాయవాదులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మోటార్ వెహికల్ ప్రమాదాల కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కంపెనీ మెంబర్స్, కౌన్సెల్స్ పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. సమస్యలుంటే పిటిషనర్‌ను, అతడి కౌన్సెల్‌ను కూడా పిలిపించి ప్రీ సిట్టింగ్ ద్వారా కేసును రాజీ చేయాలని ఆయన సూచించారు. రెండో అదనపు జిల్లా జడ్జి వై. నాగరాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, ఇన్సూ్యరెన్స్ కంపెనీల ప్రతినిధులు, కౌన్సెల్స్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు. సమావేశంలో బార్ కౌన్సెల్ సభ్యుడు వి.బ్రహ్మారెడ్డి, న్యూ ఇండియా, ఓరియంటల్, యునైటెడ్, నేషనల్ ఇన్సూ్యరెన్స్ కంపెనీల ప్రతినిధులు, కౌన్సెల్స్ పాల్గొన్నారు.

నగలు చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు

రూ. 34లక్షలు విలువ చేసే వస్తువులు స్వాధీనం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కె.నాగేశ్వరరావు

చిలకలూరిపేట: బంగారు ఆభరణాలు చోరీకి పాల్పడిన ఇరువురు నిందితులను చిలకలూరిపేట రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. చిలకలూరిపేట పట్టణంలోని డైక్‌మెన్ కాలనీకి చెందిన పేదాల రాముడు, మదర్ థెరిస్సా కాలనీలో నివాసం ఉంటున్న బీరా సిద్దు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని పసుమర్రు గ్రామానికి చెందిన యలగాల హనుమాయమ్మ ఈ నెల ఆరో తేదీన ఇంటికి తాళం వేసి సంతమాగులూరు మండలం, ఏల్చూరు గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి 11వ తేదీ ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో పరిశీలించగా 42 సవర్ల బంగారు నగలు, 59.40 గ్రాముల వెండి వస్తువులు, రాగి బిందెలు, చెంబులు, ఇత్తడి సామగ్రి దొంగతనానికి గురైనట్లు గుర్తించి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వీటి విలువ సుమారు రూ. 34లక్షలు ఉంటుంది. రూరల్ సీఐ బి.సుబ్బనాయుడు, ఎస్ఐ జి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి నిందితులను చిన పసుమర్రు గొర్రెల మండి వద్ద అరెస్టు చేసి వారి నుంచి చోరీకి గురైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు అందిన వారంలోపు నిందితులను పట్టుకొని వారి వద్ద నుంచి నగలు స్వాధీనం చేసుకోవడంపై పోలీసు సిబ్బందికి డీఎస్పీ అభినందనలు తెలిపారు. సమావేశంలో ఏఎస్ఐలు డి.రోసిరాబు, జి.సుబ్బారావు, హెచ్‌సీలు కె.దేవరాజు, జె.శ్రీధర్, పీసీలు ఎం.యిర్మియా, బి.అశోక్, ఎం.రత్నకిషోర్ పాల్గొన్నారు.